సాక్షి తిరుపతి

మంగళవారం । 17 । అక్టోబర్ । 2023



ముగిసిన క్రీడాపోటీలు

తిరుపతిలో మూడు రోజులపాటు జరిగిన విద్యుత్ ఉద్యోగుల క్రీడాపోటీలు సోమవారం ముగిశాయి. - 10లో



చిరుధాన్యాలతో ఆరోగ్యం

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.ముక్తేశ్వరరావు తెలిపారు. - 10లో

	గరిష్టం	కనిష్టం
తిరుపతి	34	22
చిత్తూరు	33	22
తిరుమల	30	18
గూడూరు	36	24
నగరి	34	23

న్యూస్‌రీల్

శ్రీకాళహస్తిలో మళ్లీ నేతి దీపాల దందా



వినాయకుని ఆలయం వద్ద వెలిగించిన నేతి దీపాలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో మళ్లీ నేతిదీపాల దందా మొదలైంది. దోషాలు పోగొట్టుకోవడానికి వచ్చే భక్తులనే లక్ష్యంగా చేసుకుని నేతిదీపాల ముఠా రెచ్చిపోతోంది. అడ్డదిడ్డంగా కలుషిత నేతిదీపాలు, ఇతరత్రా పూజాసామగ్రి అంటగడుతూ వారి జేబులు గుల్లజేస్తోంది. సోమవారం తూర్పు ద్వారం వద్ద ఉన్న వాయు మూల గణపతి ఆలయం వద్ద భక్తులు నేతిదీపాలను వెలిగించారు. ఇందుకు ధర్మకర్తల మండలిలోని ఓ వ్యక్తి కారణమని తెలుస్తోంది. దీనిపై ఓ మహిళా వ్యాపారి రెండు రోజుల క్రితం పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమను అతను బెదిరిస్తున్నాడని, తన వద్ద నేతి సీసాలు కొనుగోలు చేయనివ్వడంలేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ వివాదం పరిష్కారంగాక ముందే మళ్లీ సోమవారం నేతిదీపాలు ప్రత్యక్షం అవ్వడం చర్చనీయాంశమైంది. ఇందులో ఎవరి పాత్ర ఉందో ఆలయ అధికారులు తేల్చాల్సి ఉంది.

స్పందనకు 146 అర్జీలు



అర్జీలను పరిశీలిస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి అర్బన్: గడువులోపు స్పందన అర్జీలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ కే.వెంకట రమణారెడ్డి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుంచి 146 అర్జీలు వచ్చినట్టు ఆయన పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ, డీఆర్వో పెంచలకిషోర్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ శ్రీనివాసులు, ప్రోటోకాల్ అధికారి భాస్కర్‌నాయుడుతో కలిసి అర్జీలు స్వీకరించినట్టు వెల్లడించారు. ఇందులో అత్యధికంగా రెవెన్యూశాఖకు సంబంధించి 97 అర్జీలు వచ్చినట్టు తెలిపారు. సంబంధిత అర్జీలను వెంటనే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయాశాఖల అధికారులను ఆదేశించారు.

గ్లోబల్ ఫ్రీ జోన్ ఆఫ్ ది ఇయర్‌గా శ్రీసిటీ



శ్రీసిటీ కార్యాలయం

వరదయ్యపాళెం: ఆసియా–పసిఫిక్ ప్రాంతంలో అత్యుత్తమ గ్లోబల్ ఫ్రీ జోన్ ఆఫ్ ది ఇయర్ (జీఎఫ్‌జెడ్)గా శ్రీసిటీకి గుర్తింపు లభించింది. ఎఫ్‌డీఐ ఇంటెలిజెన్స్ సంస్థ వారి గ్లోబల్ ఫ్రీ జోన్స్ ఆఫ్ ది ఇయర్ 2023 10వ ఎడిషన్‌లో శ్రీసిటీకి ఈ ప్రత్యేక గుర్తింపు లభించింది. ఎఫ్‌డీఐ ఇంటెలిజెన్స్ అనేది ప్రపంచంలోని పారిశ్రామిక జోన్లు, విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు సంబంధించి అత్యంత ప్రాచుర్యం కలిగిన ప్రచురణ సంస్థ. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడులకు అనువైన కేంద్రాలు, వ్యాపార విస్తరణ, ఆర్థిక అభివృద్ధికి మెరుగైన అవకాశాలు కలిగిన ప్రాంతాలను ఈ సంస్థ గుర్తిస్తుంది. అందులో భాగంగా ఈ ఏడాది 90 దేశాల్లోని 4,921 వ్యాపార కేంద్రాలను పరిగణనలోకి తీసుకుని పలు విభాగాల్లో ఉత్తమ జోన్‌లను ఈ సంస్థ ప్రకటించింది. గుర్తింపు దక్కడం పట్ల శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

అదివో..అల్లదివో..!

శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవ సంరంభంతో తిరుగిరులు శోభాయమానంగా విరాజిల్లుతున్నాయి.
భక్తకోటి గోవింద నామస్మరణలతో మార్మోగుతున్నాయి.
మహిమాన్వితమైన మాడ వీధుల్లో విహరిస్తున్న మలయప్ప దివ్య తేజంతో అలరారుతున్నాయి.
వైకుంఠనాథుని స్తుతిస్తూ వాహన సేవల ఎదుట సాగుతున్న కళారూపాలు ఆధ్యాత్మికానందాలను పంచుతున్నాయి.
దేవదేవుని సేవలో పరవశిస్తూ.. తరిస్తున్నాయి.

- అంగరంగ వైభవంగా శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు
- ఉదయం చిన్నశేష వాహనంపై విహరించిన మలయప్ప
- రాత్రి హంస వాహనాన్ని అధిరోహించిన శ్రీవారు
- ఆకట్టుకున్న కళాబృందాల ప్రదర్శన



హంస వాహన సేవలో అశేష భక్తజనం (ఇన్‌సెట్) రాయంచపై శ్రీవారు



తిరుమల: తిరుమల శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. రెండో రోజు సోమవారం ఉదయం స్వామివారు బద్రినారాయణుడి అలంకరణలో చిన్నశేష వాహనంపై విహరిస్తూ భక్తకోటిని అనుగ్రహించారు. నాలుగు మాడ వీధుల్లో భక్తులు గోవిందనామ స్మరణ మిన్నంటించారు. స్వామివారికి కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే రాత్రి శ్రీమలయప్పస్వామి వారు హంస వాహనంపై వీణ ధరించి సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. వాహనసేవల్లో తిరుమల పెద్ద జీయర్‌స్వామి, తిరుమల చిన్నజీయర్‌స్వామి, టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి, కలెక్టర్ కే.వెంకట రమణారెడ్డి, జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, సీవీఎస్వో నరసింహకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక ఆనందం

వాహన సేవల ముందు కళాబృందాల ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సారి దేశంలోని 14 రాష్ట్రాలకు చెందిన కళాకారులు విభిన్న ప్రదర్శనలతో ఆకట్టుకుంటున్నారు. సంప్రదాయ కళలతోపాటు, జానపద నృత్యాలకు ప్రాధాన్యమిస్తున్నారు.

చిన్నశేషవాహన సేవలో టీటీడీ చైర్మన్ భూమన, ఈఓ ధర్మారెడ్డి







నరకాసుర వధ ఘట్టాన్ని ప్రదర్శిస్తున్న కళాకారులు



రాధాకృష్ణుల లీలావినోదం



కళాకారుల నృత్యభంగిమ

చిన్నశేషునిపై చిద్విలాసం

- హంస వాహనంపై వీణాపాణి
- దర్శించిన వారికి యోగ సిద్ధి ఫలం!
- అలరించిన చెక్క భజనలు, డప్పు వాయిద్యాలు
- ప్రత్యేక ఆకర్షణగా వృషభాలు

తిరుపతి రూరల్: తుమ్మలగుంట క్షేత్రంలో జరుగుతున్న శ్రీ కల్యాణ వేంకటేశ్వర స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు మురళీ మనోహరునిగా భక్తులకు దర్శనమిచ్చారు. సోమ వారం ఉదయం చిన్న శేషవాహనం, రాత్రి హంస వాహనంపై మలయప్ప స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. స్వామి వారి చిన్నశేష వాహనానికి ముందు అశ్వాలు, వృషభాలు ఠీవీగా నడుస్తుండగా భజన బృందాలు తమ నృత్యాలతో భక్తులకు కనువిందు చేశాయి. చిన్న శేష వాహన సేవలో అశేష భక్త జనం పాల్గొని స్వామి వారికి అడుగడుగునా హారతులు ఇచ్చారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి దంపతులు, ఈఓ నల్లందుల సుబ్బరామిరెడ్డి, తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి పాల్గొన్నారు.



చిన్న శేషవాహనంపై కల్యాణ వెంకన్న

చిన్న శేషునిపై దర్శించిన వారికి యోగ సిద్ధిఫలం

శేషుడు నారాయణాంశ సంభూతుడు. విష్ణువు యొక్క అపరదేహం. ఐదు పడగలు కలిగిన ఈ చిన్న శేషుడిపై రంగనాథ స్వామి ఉత్సవ విగ్రహం తిరుమలలో కొంతకాలం ఉండేదని చరిత్ర ద్వారా తెలుస్తోంది. అందుకు గౌరవ సూచికంగా రెండో రోజు ఉదయం స్వామి వారు ఐదు పడగలు గల చిన్నశేష వాహనంపై భక్తులకు దర్శనమిస్తారని, ఆ సమయంలో శ్రీనివాసుడిని దర్శించి, ధ్యానించడం వల్ల మనిషిలోని మనోవైకల్యాలు నశిస్తాయని ప్రతీతి.

కల్యాణ వెంకన్నకు సారె సమర్పణ

చిన్న శేష వాహనంపై అధిరోహించిన కల్యాణ వెంకన్నకు తుమ్మలగుంట గ్రామస్తులు సారె తీసుకు వచ్చి సమర్పించారు. గ్రామంలో ప్రతి ఇంటి ముందు మహిళలు కర్పూర హారతులు సమర్పించి భక్తి ప్రపత్తులను చాటుకున్నారు.

హంస వాహనంపై వీణాపాణి



తుమ్మలగుంట శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో సోమవారం రాత్రి అనంత తేజోమూర్తి అయిన కల్యాణ వేంకటేశ్వర స్వామి సరస్వతీదేవి అలంకారంలో హంస వాహనంపై ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. అంతకు ముందు ఆలయ ప్రాంగణంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీనివాసునికి ఊంజల్ సేవ నిర్వహించారు. హంస వాహన సేవలో ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, చెవిరెడ్డి లక్ష్మి దంపతులు పాల్గొన్నారు.



చిన్నశేషవాహన సేవలో ప్రభుత్వ విప్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

మహిళా పక్షపాతి జగనన్న



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

- గడప గడపలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: 'రాష్ట్రంలోని అక్కచెల్లెమ్మలకు ఏదో ఒకటి చేయాలనే తపన. వారి కాళ్లపై వారు నిలబడాలనే ఆత్రుత.. రాజకీయ పదవుల్లోనూ సగ భాగంకంటే ఎక్కువగా మహిళలకే ఇవ్వాలనే ఆకాంక్ష.. ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారు. రాష్ట్ర వ్యాప్తంగా 30 లక్షలకుపైగా ఇళ్లపట్టాలు మహిళల పేరుపై ఇప్పించారు. అంతేగాక ఉచితంగా ఇళ్లు కట్టించి వారికి వెన్నుదన్నుగా నిలిచారు. సంక్షేమ పథకాలన్నీ మహిళల పేరుపైనే కొనసాగిస్తూ మహిళా పక్షపాతిగా పేరుతెచ్చుకున్నారు' అని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కొనియాడారు. సోమవారం పట్టణంలో 14వ వార్డు ఎంజీస్ట్రీట్, జెట్టిపాళెం, పిట్టలవారి సంధు, నెహ్రూవీధి, ఓటేరు కాలువ వీధుల్లో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల పేరుపై ఇంటి పట్టాలిచ్చి ఇళ్లు కట్టిస్తున్న ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. రాజీవ్‌నగర్ కాలనీ, ఊరందూరు ప్రాంతాల్లో నిర్మిస్తున్న ఇళ్లు పూర్తికావచ్చాయని, త్వరలోనే గృహప్రవేశాలు చేస్తామని చెప్పారు.

వైఎస్సార్‌సీపీలోకి వలసల జోరు

పట్టణంలోని ఆంధ్రరాష్ట్ర యానాది సంఘం తరపున శ్రీకాళహస్తి నియోజకవర్గంలోని యానాది సంఘం సభ్యులు 64 మంది ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో చందమామల కోటయ్య, లక్ష్మమ్మ, వసంతరావు, వనజమ్మ తదితరులు ఉన్నారు.

ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలకు అటానమస్ హోదా

- పదేళ్లపాటు హోదా కల్పించిన యూజీసీ
- అధ్యాపక బృందానికి టీటీడీ చైర్మన్, ఈఓ అభినందనలు

తిరుపతి సిటీ: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీగోవిందరాజ స్వామి ఆర్ట్స్ కళాశాలకు యునివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ పదేళ్లపాటు అటానమస్ హోదా కల్పిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. దీంతో కళాశాల అభివృద్ధికి స్వతహాగా నిర్ణయాలు తీసుకునేందుకు అవకాశం కలిగింది. విద్యావిధానం, పరీక్షల నిర్వణ పోటీ ప్రపంచాన్ని ఎదుర్కొనేలా సిలబస్‌లో మార్పులు చేసుకోవడం ఆ కళాశాలకు వీలవుతుంది. అలాగే సామాజిక సేవా దృక్పథంతో విద్యాబోధన, ఆధునిక సాంకేతిక ఆదరణ కోర్సుల నిర్వణ, మెమొరీ బేస్డ్ విద్యావిధానం ఏర్పాటుకు వెసులుబాటు ఉంటుంది. ప్రాంగణ ఎంపికలకు ప్రపంచ స్థాయి సంస్థలు ముందుకు వస్తాయి. 1969లో ఏర్పాటైన ఈ కళాశాలలో నిపుణులైన అధ్యాపకులు, నాణ్యమైన వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్నారు. మొత్తం 2,200 మంది విద్యార్థులుండగా 1,500 మందికి హాస్టల్ వసతి కల్పిస్తున్నారు. 19 విభాగాలు, 19 కోర్సులు అందిస్తున్నారు. తొలి ప్రయత్నంలోనే నాక్‌ఏ ప్లస్ గ్రేడ్ సాధించడం విశేషం. ఈ సందర్భంగా టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ధర్మారెడ్డి, జేసీఓ సదాభార్గవి, డీఈఓ భాస్కర్‌రెడ్డి, కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులను ప్రత్యేకంగా అభినందించారు.



ఎస్‌జీఎస్ ఆర్ట్స్‌కళాశాల ప్రధాన భవనం

ముందే చెప్పిన 'సాక్షి'

ఎస్‌జీఎస్ కళాశాలకు అటానమస్ హోదా రానుందని ఇటీవల 'సాక్షి' పేర్కొంది. 'అడుగు దూరంలో అటానమస్' శీర్షికన జిల్లా ప్రత్యేక సంచికలో వార్త వెలువడింది. దీనికనుగుణంగానే నేడు అటానమస్ హోదా రావడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

తమిళనాడు రేషన్ బియ్యం స్వాధీనం


సీజ్ చేసిన తమిళనాడు రేషన్ బియ్యం

దొరవారిసత్రం: చెన్నై నుంచి నెల్లూరుకు లారీలో అక్రమంగా తరలుతున్న 414 బస్తాల తమిళనాడు రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లయ్, విజిలెన్స్ అధికారులు మూకుమ్మడిగా దాడి చేసి స్వాధీనం చేసుకున్న ఘటన దొరవారి సత్రం మండలం, కృష్ణాపురం గ్రామం వద్ద చోటు చేసుకుంది. సివిల్ సప్లయ్ అధికారుల కథనం.. చెన్నై చుట్టుపక్కల ప్రాంతాల్లో అక్కడి రేషన్ బియ్యాన్ని కొందరు కొనుగోలు చేసి లారీలో నెల్లూరుకు అక్రమంగా తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో కృష్ణాపురం వద్ద అధికారులు కాపుకాశారు. అనుమానాస్పదంగా వస్తున్న లారీని ఆపి పరిశీలించగా అందులో 414 బస్తాల్లో.. 20,260 కిలోల తమిళనాడు రేషన్ బియ్యాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. బియ్యం విలువ రూ.4.52లక్షల వరకు ఉండవచ్చని అధికారులు తెలిపారు. బియ్యాన్ని సూళ్లూరుపేట వ్యవసాయశాఖ గోదాములో భద్రపరిచినట్టు వెల్లడించారు. దాడుల్లో సివిల్ సప్లయ్ డీటీ ఓబయ్య, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

- విద్యార్థులకు సాత్విక ఆహారంతోనే మేథోసంపత్తి
- వ్యాధుల నివారణకు చిరుధాన్యాలే అత్యవసరం
- ఏపీ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ముక్తేశ్వరరావు


మిల్లెట్ ఎగ్జిబిషన్ స్టాల్స్‌ను ప్రారంభిస్తున్న ఆంధ్రప్రదేశ్ మాజీ ప్రిన్సిపల్ సెక్రటరీ ముక్తేశ్వరరావు

తిరుపతి సిటీ: చిరుధాన్యాలతోనే మానవునికి సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని మాజీ ప్రిన్సిపల్ సెక్రటెరీ ఎస్.ముక్తేశ్వరరావు సూచించారు. సోమవారం తిరుపతి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో మూడు రోజుల పాటు జరగనున్న ఇంటర్నేషనల్ మిల్లెట్ వార్షికోత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని పారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం చిరుధాన్యాల ఆహారానికి అత్యంత ప్రాముఖ్యత నివ్వాలని, బీపీ, షుగర్, గుండె జబ్బులు, ఒత్తిడి, ఉభకాయం వంటి వ్యాధుల నివారణకు ఇవి తోడ్పడతాయన్నారు. దైనందిన జీవితంలో చిరుధాన్యాలకు అధిక ప్రాధాన్యత నిచ్చి జీవన ప్రమాణ స్థాయిని పెంపొందించుకోవాలని సూచించారు. రాగి మాల్ట్, రాగి జావా, రాగిదోశె, జొన్నరొట్టెలు, ఊదలు, అరికెలు, కొర్రలు ఉప్మా లాంటి చిరుదాన్యాలతో చేసిన వంటకాలను స్వీకరించాలన్నారు. అనంతరం వేదిక్ వర్సిటీ వీసీ రాణి సదాశివమూర్తి, సంస్కృత విశ్వవిద్యాలయం వీసీ జీవీఆర్ క్రిష్ణమూర్తి మాట్లాడారు. చిరుధాన్యాలు శాలిధాన్యాలుగా, కుధాన్యాలుగా రెండు రకాలుగా విభజించవచ్చన్నారు. శాలిధాన్యాలను సామాన్యమానవులు, కుధాన్యాలను యోగులు, సన్యాసులు ఇంద్రియ నిగ్రహం కోసం ఉపయోగిస్తారని చెప్పారు. విద్యార్థులు సాత్విక ఆహారాన్ని స్వీకరించి మేథోసంపత్తిని పెంచుకోవాలని కోరారు. అనంతరం వీసీలతో కలిసి మాజీ ప్రిన్సిపల్ సెక్రటెరీ మిల్లెట్ స్టాల్స్‌ను పరిశీలించారు. సభలో గౌరవాధ్యక్షులుగా పాల్గొన్న ప్రముఖ ఆయుర్వేద వైద్యులు డాక్టర్ జీవీ.పూర్ణచందర్ మిల్లెట్స్, ప్రకృతి ప్రసాదించిన మూలికలు వాటి వినియోగం, ఉపయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. డీన్ ప్రొఫెసర్ రాఘవాచార్యులు, డాక్టర్ లక్ష్మీనారాయణ, డాక్టర్ శేఖర్‌రెడ్డి, వర్సిటీ అధ్యాపకులు, పాల్గొన్నారు.

మిల్లెట్స్‌తో ఎంతో ఆరోగ్యం



ప్రకృతి ప్రసాదించిన చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోకుండా జంక్ ఫుడ్స్‌ను వినియోగిస్తూ అనారోగ్యాన్ని కొనితెచ్చుకుంటున్నాం. గతంలో మన పెద్దలు మిల్లెట్స్‌ను ఆహారంగా తీసుకుని ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. అందుకే వారి జీవన ప్రమాణ స్థాయి అధికంగా ఉండేది. ప్రస్తుతం కలుషిత ఆహారం తీసుకుంటూ, ప్లాస్టిక్ వస్తువులను విరివిగా వాడుతూ మానవ ఆయుష్షును తగ్గించుకుంటున్నాం. మళ్లీ చిరుధాన్యాల అవశ్యకతపై అవగాహన కలిగించేందుకు మిల్లెట్స్ దినోత్సవాలను జరుపుకునే దౌర్భాగ్య స్థితికి చేరుకోవడం బాధకలిగిస్తోంది.

-ఎం.కృతి, ఎంఏ, సెకండ్ ఇయర్ విద్యార్థిని, ఎస్ఎస్‌యూ, తిరుపతి

స్వచ్ఛమైన నూనెలతో వ్యాధులు దూరం



కలుషిత నూనెలను ఉపయోగించడంతో చిన్న వయస్సులోనే యువత షుగర్, బీపీ, అధిక బరువు, మానసిక ఒత్తిడి, క్యాన్సర్ వంటి వ్యాధుల భారిన పడుతున్నారు. స్వచ్ఛమైన వేరుశెనగ, ప్రొద్దుతిరుగుడు, కొబ్బరి, కుసుమ విత్తనాలతో చెక్కగానుగ ద్వారా తీసిన నూనెలను వాడుకుంటే మంచి ఆరోగ్యం సాధ్యం.

- యుక్తాముఖి, సునితాదొర, బీఈడీ, ఎంఈడీ విద్యార్థినులు, ఎస్ఎస్‌యూ, తిరుపతి

ఆధ్యాత్మిక పుస్తకాల ఆవిష్కరణ


పుస్తకాలు ఆవిష్కరిస్తున్న టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ ధర్మారెడ్డి, జేఈఓ

తిరుమల: శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజైన సోమవారం ఉదయం చిన్న శేష వాహనసేవలో మూడు ఆధ్యాత్మిక పుస్తకాలను టీటీడీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈఓ ఏవీ.ధర్మారెడ్డి ఆవిష్కరించారు. ఇందులో పరిష్కర్త శ్రీవైద్యం వేంకటేశ్వరాచార్యులు రచించిన శ్రీ ప్రబంధరాజ వేంకటేశ్వర విజయవిలాసం, అంబికా అనంత్ రంచిన అంబ్రాసిల్ గ్లోరీ ఆఫ్ తిరుమల, చివుకుల రమాకాంత్ శర్మ రచించిన మహర్షులు లోకోపకారం వ్రతం పుస్తకాలు ఉన్నాయి. కార్యక్రమంలో ఢిల్లీ స్థానిక సలహా మండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, జేఈఓ సదాభార్గవి, ఎస్ఈ -2 జగదీశ్వర్‌రెడ్డి, అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకులు విభీషణశర్మ, ఉప సంపాదకులు నరసింహాచార్య పాల్గొన్నారు.

టీటీడీలో ఐటీతో పారదర్శక సేవలు


మాట్లాడుతున్న ఐటీ జనరల్ మేనేజర్ సందీప్‌రెడ్డి

తిరుమల: టీటీడీ ఐటీ విభాగం ద్వారా శ్రీవారి భక్తులకు దర్శనం, ఆర్జిత సేవలు, గదులు, లడ్డూ ప్రసాదం తదితర సేవలను వేగంగా, పారదర్శకంగా అందిస్తోందని ఐటీ జనరల్ మేనేజర్ సందీప్‌రెడ్డి తెలిపారు. తిరుమల రాంభగీచా-2లోని మీడియా సెంటర్‌లో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బ్రహ్మోత్సవాల్లో తొలిసారిగా వెహికల్ పాస్ మేనేజ్మెంట్ సిస్టం అప్లికేషన్ రూపొందించి తిరుపతి శివారు ప్రాంతాల్లో వాహనాలకు పాసులు మంజూరు చేశామన్నారు. దీని ద్వారా తిరుమలలో వాహనాల రద్దీ పెరిగినప్పుడు విజిలెన్స్ అధికారులు తిరుపతిలోనే పార్కింగ్ వసతి కల్పించారని తెలిపారు. బ్రహ్మోత్సవాల వాహన సేవలను సోషల్ మీడియా ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేస్తున్నామని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు వాహన సేవలను వీక్షించి తరిస్తున్నారన్నారు. ఒకే సంస్థ, ఒకే వెబ్‌సైట్, ఒకే మొబైల్ యాప్ అన్న నినాదం మేరకు వెబ్‌సైట్ పేరును https://ttddevasthanams.ap.gov.in గా మార్చామని వెల్లడించారు. తద్వారా టీటీడీకి సొంతంగా ట్రేడ్ మార్క్ ఉంటుందని, నకిలీ వెబ్‌సైట్లను నియంత్రించే అవకాశం లభిస్తుందన్నారు. 2021 నుంచి టీటీడీ వెబ్‌సైట్, యాప్ క్లౌడ్‌కు మారాయని, అప్పటి నుంచి వేగవంతంగా దర్శన టికెట్లు, ఆర్జిత సేవలు, గదుల బుకింగ్ జరుగుతోందని వివరించారు. వీటితోపాటు తిరుపతిలో సర్వదర్శనం టోకెన్లు, దివ్యదర్శనం టోకెన్లు జారీ చేస్తున్నామని, తిరుమలలో పారదర్శకంగా గదులు కేటాయించేందుకు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ అమలు చేస్తున్నామన్నారు. ఆర్జితసేవల ఆన్‌లైన్ లక్కీడిప్‌తో పాటు తిరుమలలోని సీఆర్ఓ కార్యాలయంలో ఆఫ్‌లైన్లో ఎలక్ట్రానిక్ డిప్ అమలు చేస్తున్నామని చెప్పారు. టీటీడీ విద్యాసంస్థల్లో స్టూడెంట్ మేనేజ్మెంట్ అప్లికేషన్ ద్వారా విద్యార్థులకు ప్రవేశాలు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. స్విమ్స్, బర్డ్ ఆస్పత్రుల్లో హాస్పిటల్ మేనేజ్మెంట్ అప్లికేషన్ ద్వారా మెరుగైన పాలన జరుగుతోందన్నారు. త్వరలో టీటీడీ పరిధిలోని 60 స్థానిక ఆలయాల్లో భక్తులు ఆర్జిత సేవలను ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే అవకాశం కల్పిస్తామన్నారు. శ్రీవారి సేవ ఆన్‌లైన్ అప్లికేషన్ ద్వారా సేవకులు నమోదు చేసుకుంటున్నారని చెప్పారు. టీటీడీ ఉద్యోగుల ఇళ్ల స్థలాలకు సంబంధించి డిప్‌ను ఎలక్ట్రానిక్ పద్ధతిలో పారదర్శకంగా నిర్వహించామన్నారు. పీఆర్వో టీ.రవి, ఏపీఆర్వో పీ.నీలిమ, ఐటీ మేనేజర్లు నాదముని, నాగరాజరెడ్డి పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల: తిరుమల క్యూకాంప్లెక్స్‌లో 4 కంపార్ట్‌మెంట్లు నిండాయి. ఆదివారం అర్ధరాత్రి వరకు 60,659 మంది స్వామి వారిని దర్శించుకోగా.. 21,304 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.2.72 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టిక్కెట్లు లేని భక్తులకు 6 గంటల్లో దర్శనం లభిస్తోంది.

ముగిసిన విద్యుత్ ఉద్యోగుల క్రీడా పోటీలు


బాస్కెట్‌బాల్ విజేత ఆర్టీపీసీ జట్టు


షటిల్ విజేత జెన్కో కృష్ణపట్నం జట్టు

- హాకీ చాంపియన్‌గా తిరుపతి - బాస్కెట్‌బాల్ విజేత ఆర్టీపీసీ

తిరుపతి రూరల్: తిరుపతిలో మూడు రోజులుగా జరుగుతున్న విద్యుత్ ఉద్యోగుల రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు సోమవారం ముగిశాయి. ఎస్పీడీసీఎల్ స్పోర్ట్స్ కౌన్సిల్ తిరుపతి సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో రాష్ట్ర నలుమూలల నుంచి ఉద్యోగులు పాల్గొన్నారు. హాకీ, బాస్కెట్‌బాల్, షటిల్ విభాగాల్లో పోటీలు జరిగాయి. తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయం ఇండోర్ ఆడిటోరియంలో జరిగిన ముగింపు కార్యక్రమానికి డైరెక్టర్ శశికళ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఉద్యోగులు క్రీడా స్ఫూర్తితో ఈ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటారని కొనియాడారు. విద్యుత్ ఉద్యోగులకు చక్కటి ఏర్పాట్లు చేసిన తిరుపతి స్పోర్ట్స్ కౌన్సిల్‌ను అభినందించారు.

హాకి విజేత తిరుపతి సర్కిల్ జట్టు

ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ కార్పొరేషన్ ఉద్యోగుల ఇంటర్ సర్కిల్ హాకీ, బాస్కెట్ బాల్, షటిల్ పోటీల్లో భాగంగా ఈనెల 14 నుంచి జరిగిన హాకీ పోటీల్లో తిరుపతి సర్కిల్ మొదటి స్థానంలో నిలిచింది. ఇక కడప సర్కిల్, నెల్లూరు సర్కిల్ జట్లు సంయుక్తంగా ద్వితీయ స్థానంలో నిలిచాయి. బాస్కెట్ బాల్ పోటీల్లో రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టు (ఆర్టీపీసీ) జట్టు మొదటి స్థానంలోనూ, డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (డాక్టర్ ఎన్‌టీపీయస్) జట్టు ద్వితీయ స్థానంలోనూ, ఏపీఎస్పీడీసీఎల్ నెల్లూరు సర్కిల్ జట్టు తృతీయ స్థానంలోనూ నిలిచాయి. షటిల్ విభాగంలో ఏపీ జెన్కో కృష్ణపట్నం జట్టు మొదటి స్థానంలోనూ, ఆర్టీపీసీ ద్వితీయ స్థానంలోనూ, ఎస్పీడీసీఎల్ నెల్లూరు సర్కిల్ జట్టు తృతీయ స్థానంలోనూ నిలిచాయి. ఈ సందర్భంగా వివిధ పోటీల్లో విజేతలకు డైరెక్టర్ శశికళ చేతుల మీదుగా ట్రోఫీలు, సర్టిఫికెట్లను బహుకరించారు. స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ కృష్ణారెడ్డి, జనరల్ సెక్రటరీ వాసుదేవరెడ్డి, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రతినిధులు వాసురెడ్డి, పురుషోత్తం, లీలారామ్ పాల్గొన్నారు.

క్రీడా పోటీలకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇంటర్ కాలేజ్ గేట్ టోర్నమెంట్ 2023-24 నిర్వహించనున్నట్లు డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ ఎం శివశంకర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో మొదటి విడత పురుషుల గేమ్స్‌కు సంబంధించి హ్యాండ్‌బాల్, బాస్కెట్ బాల్, ఖోఖో, సాఫ్ట్‌బాల్ పోటీలు ఈనెల 28, 29తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. రెండవ విడత పురుషుల గేమ్స్‌ను ఎస్వీ ఆర్ట్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ఎస్ ముస్తక్ ఆహ్మద్ ఆధ్వర్యంలో ఫుట్‌బాల్, హాకీ, బాల్‌బ్యాడ్మింటన్, టెన్నీస్ పోటీలు వచ్చేనెల 1, 2 తేదీల్లో నిర్వహిస్తారని చెప్పారు. ఈ పోటీల్లో పాల్గొనే అభ్యర్థులు ఈనెల 25లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

- మూడవ విడత పురుషుల క్రీడలు బ్యాడ్మింటన్, చెస్, టేబుల్ టెన్నీస్, వాలీబాల్ పోటీలు పలమనేరు ఎస్వీసీఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఎం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నవంబర్ 15, 16 తేదీల్లో నిర్వహించనున్నట్లు వివరించారు. ఇందులో పాల్గొనే అభ్యర్థులు నవంబర్ 2వతేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.
- నాలుగో విడత పురుషుల క్రీడలకు సంబంధించి బాక్సింగ్, జూడో, కరాటే, తైక్వాండో పోటీలు వచ్చేనెల 20న జరుగుతాయని, దీనికి వచ్చేనెల 4వతేదీ లోపు నమోదు చేసుకోవాలని కోరారు.
- ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో నవంబర్ 7 నుంచి 9 వతేదీ వరకు నిర్వహించనున్న ఇంటర్ కాలేజీగేట్ ఉమెన్ గేమ్స్‌కు సంబంధించి బాస్కెట్‌బాల్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, బ్యాడ్మింటన్, టెన్నీస్, టేబుల్ టెన్నీస్, చెస్ పోటీలు ఉంటాయన్నారు. మహిళా అభ్యర్థులు ఈ నెల 28లోపు పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.
- మహిళల క్రికెట్, హాకీ యూనివర్సిటీ సెలక్షన్లు నవంబర్ 9న నిర్వహించనున్నట్లు తెలిపారు.
- ఇంటర్ కాలేజీగేట్ మెన్స్ క్రికెట్ టోర్నమెంట్ డిసెంబర్ 1వ తేదీ నుంచి ప్రారంభమవుతుందని, ఆసక్తిగల క్రీడాకారులు వచ్చేనెల 20వ తేదీలోపు ఎంట్రీలు చేసుకోవాలని కోరారు.
- ఇంటర్ కాలేజీగేట్ అథ్లెటిక్ మీట్ మెన్ అండ్ ఉమెన్ 2023-24కు సంబంధించి 16రకాల అథ్లెటిక్స్‌ను నవంబర్ 27, 28 తేదీల్లో నిర్వహిస్తామని, దీనికి సంబంధించి ఎంట్రీలను వచ్చేనెల 15లోపు అందజేయాలని పేర్కొన్నారు.
- ఇంటర్ కాలేజీగేట్ మెన్ కబడ్డీ టోర్నమెంట్ నవంబర్ 3వతేదీన నిర్వహిస్తామని చెప్పారు. దీనికి ఈనెల 25లోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. పోటీల్లో పాల్గొనే విద్యార్థులు కళాశాల ప్రిన్సిపల్ నుంచి అర్హత ధృవపత్రాన్ని, ఆధార్‌కార్డ్, ఎస్ఎస్ఎసీ, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లను వెంట తీసుకురావాలని ఆయన ఆ ప్రకటనలో తెలియజేశారు. మరిన్ని వివరాలకు 9441296125ను కానీ ఎస్వీయూ ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో నేరుగా కానీ సంప్రదించాలని కోరారు.

18న మహిళా వర్సిటీలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పలు కోర్సులకు సంబంధించి స్పాట్ అడ్మిషన్స్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ సువర్ణలతాదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటిగ్రేటెడ్ బయోటెక్నాలజీ, ఇంటిగ్రేటెడ్ ఫుడ్ టెక్నాలజీ, బీఒకేషనల్, న్యూట్రీషన్ అండ్ హెల్త్ కేర్ సైన్సెస్, ఫ్యాషన్ టెక్నాలజీ అండ్ అప్పారెల్ డిజైన్, మాస్టర్స్ ఇన్ ఫైన్ ఆర్ట్స్ కోర్సులతోపాటు కొత్తగా ప్రవేశపెట్టిన బ్యాచిలర్స్ ఆఫ్ సైన్స్ ఇన్ స్టాటిస్టిక్స్, బ్యాచిలర్స్ ఆఫ్ సోషల్‌వర్క్ కోర్సులకు ఈ నెల 18న స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు www.spmvv.ac.inని సంప్రదించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


మృతుడు శివకుమార్(ఫైల్)

రేణిగుంట: మండలంలోని గాజులమండ్యం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. గాజులమండ్యం ఎస్ఐ ధర్మారెడ్డి కథనం మేరకు... తిరుపతి మంగళం సమీపంలోని హరిత కాలనీకి చెందిన శివకుమార్(42), ఏలుమలై కలిసి ద్విచక్ర వాహనంలో తిరుత్తణి నుంచి తిరుపతికి వస్తుండగా, గాజులమండ్యం దాటి స్వర్ణముఖీ నది వంతెనపై ఎదురుగా వస్తున్న లారీ వారిని బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో లారీ కిందపడిన శివకుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. వెనుక కూర్చున్న ఏలుమలైకి స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరుపతి ఎస్వీ వైద్య కళాశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారిలో..

భాకరాపేట : తిరుపతి-మదనపల్లె జాతీయ రహదారి మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. భాకరాపేట పోలీసులు కథనం.. సోమవారం రాత్రి నెమిలిగుండ్ల సమీపంలో నడుచుకుంటూ వస్తున్న ఓ వృద్ధుడిని మదనపల్లె-2 డిపో ఆర్టీసు బస్సు (ఏపీ 03 జెడ్ 0154) ఢీ కొంది. ఈ ప్రమాదంలో వృద్ధుడు(60) అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటనా స్థలాన్ని భాకరాపేట సీఐ సురేంద్రరెడ్డి సందర్శించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఇంట్లో చోరీ

తిరుపతి క్రైమ్: శెట్టిపల్లి పంచాయతీలో ఓ ఇంట్లో చోరీ జరిగిన సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. అలిపిరి సీఐ అబ్బన్న కథనం మేరకు.. శెట్టిపల్లిలో నివాసం ఉంటున్న పాపయ్య దంప తులు సొంత ఊరిలో శుభకార్యం కోసం ఇటీవల వెళ్లారు. వారు సోమవారం తిరిగి వచ్చారు. ఇంట్లో చోరీ జరిగినట్టు గుర్తించి అలిపిరి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు క్లూస్ టీమ్ ద్వారా ఆధారాలు సేకరించారు. ఇంట్లో బీరువా తాళాలు పగులగొట్టి 30 గ్రాములు బంగారు, రూ.50 వేల నగదు చోరీ అయినట్టు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మత్స్యశాఖలో విద్యుత్ మోటార్ చోరీ

తిరుపతి అర్బన్: తిరుపతి జిల్లా మత్స్యశాఖ కార్యాలయంలో సోమవారం రూ.30 వేలు విలువైన విద్యుత్ మోటార్ చోరీకి గురైంది. మత్స్యశాఖ జిల్లా అధికారి శ్రీనివాస్ నాయక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. 20 రోజుల క్రితం రూ.15 వేలు, 40 రోజుల క్రితం రూ.15 వేల రాగి వైర్లు చోరీకి గురయ్యాయి. వరుస చోరీలతో మత్స్యశాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు. మత్స్యశాఖ కార్యాలయ ప్రాంగణంలో 30 లక్షల చేప పిల్లలను పెంచుతున్నారు. వర్షాలు కురిసి చెరువులు నిండితే వాటిని నీటిలో వదలడానికి అధికారులు సిద్ధంగా ఉన్నారు. ఈ క్రమంలో చేప పిల్లలను పెంచే తొట్టెలకు అమర్చిన విద్యుత్ మోటార్, వైర్లు చోరీకి గురికావడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు. కొత్త మోటార్, వైర్లు ఏర్పాటు చేయాలా? లేక చేప పిల్లలను కల్యాణి డ్యామ్ వద్ద ఉన్న నీటి తొట్టెల్లోకి చేర్చాలా అని ఆలోచన చేస్తున్నారు. తిరుపతి డివిజన్ అధికారి వెంకటరమణ చోరీకి గురైన ప్రాంతాన్ని సోమవారం పరిశీలించారు.

ఈవీఎంల తనిఖీ ప్రక్రియ పూర్తి చేయండి


ఫస్ట్ లెవల్ చెకింగ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటరమణారెడ్డి

రేణిగుంట: ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు నవంబర్ 10వ తేదీ లోపు బీఎంసీయూలు, వీవీ ప్యాట్‌ల ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియ పూర్తి చేయాలని కలెక్టర్ కే.వెంకటరమణారెడ్డి ఆదేశించారు. రేణిగుంట పాత విమానాశ్రయ మార్గంలో ఉన్న సీడబ్ల్యూసీ గోడౌన్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌లో జరుగుతున్న ఫస్ట్ లెవల్ చెకింగ్ ప్రక్రియను ఆయన సోమవారం పరిశీలించారు. చెకింగ్ ప్రక్రియలో చిన్నపాటి పొరపాట్లకు కూడా తావులేకుండా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల అనుసంధాన ప్రక్రియలో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్వో పెంచలకిషోర్, నోడల్ అధికారి కోదండరామిరెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు నరసింహయాదవ్, చిరంజీవి, చంద్రప్ప, బాలాజీ, మనోహరాచ్చారి, తహసీల్దార్ ఉదయ్‌సంతోష్, సురేష్ పాల్గొన్నారు.

ఆగిన లారీని ఢీకొన్న కారు


గాయపడి భయందోళనకు గురవుతున్న చిన్నారులు


నిలిచిపోయిన ట్రాఫిక్

- ఇద్దరు చిన్నపిల్లలతో సహా ఐదుగురికి గాయాలు

దొరవారిసత్రం: రోడ్డు పక్కన మరమ్మతులకు గురై ఆగిపోయి ఉన్న లారీని అటుగా వస్తున్న కారు అదుపుతప్పి ఢీకొన్న ఘటన సోమవారం వేణుంబాకం గ్రామ రోడ్డు సమీపంలోని జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. ఈ ఘటనలో కారులో ప్రయాణించే ఎం.శివప్రసాద్, భార్య వినిత, వారి ఇద్దరు పిల్లలు మనోజ్ఞ, దేవన్ష్‌చౌదరితో పాటు వీరి సమీప బంధువైన విజయ్ గాయపడ్డారు. స్థానిక పోలీసులు, 108 సిబ్బంది కథనం.. అన్నమయ్య జిల్లా, చిట్వేలు మండలం, నక్కలపల్లి గ్రామానికి చెందిన ఎం.శివప్రసాద్ తన భార్య వినితకు వైద్య చికిత్సల నిమిత్తం చెన్నైకి తీసుకెళ్లి అక్కడి నుంచి కారులో స్వగ్రామానికి పయనమయ్యారు. వేణుంబాకం గ్రామ రోడ్డు సమీపంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కన ఆగి ఉన్న లారీని ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరు చిన్నారులతో పాటు కారులో ప్రయాణించే అందరూ గాయపడ్డారు. వీరిలో వినిత, ఆమె కుమార్తె మనోజ్ఞ తీవ్రంగా గాయపడ్డారు. డీవీ సత్రం 108 వాహనం ఘటనా స్థలంకి చేరుకుని చికిత్స నిమిత్తం గాయపడిన వారిని నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వినిత, మనోజ్ఞను మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.